సాక్షి
పల్నాడు
బుధవారం, 5, మార్చి, 2025



అమ్మవారికి ప్రత్యేక పూజలు

బాపట్ల: చందోలులోని బగళాముఖి దేవస్థానంలోని అమ్మవారిని కలెక్టర్ జె.వెంకట మురళి మంగళవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెం మహంకాళి గుడి నిర్మాణానికి జూలకల్లుకి చెందిన చలంచర్ల వెంకటేశ్వర్లు దంపతులు రూ.1.01.116 విలువైన చెక్కు అందజేశారు.



అగ్రి ల్యాబ్ పరిశీలన

నరసరావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ క్రిషి వికాస్ యోజన పథకంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ అగ్రి ల్యాబ్‌ను మంగళవారం థర్డ్ పార్టీ ఎవాల్యేషన్ బృందం పరిశీలించింది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (బుధ)	సహరి (గురు)
నరసరావుపేట	6.23	5.08
గుంటూరు	6.21	5.06
బాపట్ల	6.21	5.06

న్యూస్‌రీల్

నృసింహుని ఏకాదశ మాలధారణ దీక్ష స్వీకరణ



మంగళగిరిటౌన్: మంగళగిరిలోని లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఎగువ సన్నిధిలోని పానకాలస్వామి వారి ముఖ మండపంలో మంగళవారం భక్తులు నృసింహుని ఏకాదశ మాలధారణ దీక్ష స్వీకరణ మహోత్సవం జరిగింది. దేవస్థానం ప్రధాన అర్చకులు, గురుస్వామి మాల్యవంతం శ్రీనివాసదీక్షితులు భక్తులకు మాలవేసి దీక్ష ఇచ్చారు. స్థానిక శ్రీ లక్ష్మీనరసింహస్వామి సేవా ట్రస్ట్ అధ్యక్షులు తోట శ్రీనివాసరావు మాలధారణ దీక్ష స్వీకరించే భక్తులకు దీక్షా వస్త్రాలను ఉచితంగా అందజేశారు. అనంతరం రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి అధ్యక్షులు గాజుల శ్రీనివాసరావు, న్యాయవాది రంగిశెట్టి లక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో శివారెడ్డి గురుస్వామి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు గోగినేని వెంకటేశ్వరరావు, రోటరీ క్లబ్ ప్రతినిధి సైదా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలకు ఐదుగురికి ఆహ్వానం

సత్తెనపల్లి: అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడంలో ప్రత్యేకత చాటుకున్న ఎంపీడీవో, గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు ఈనెల 4, 5 తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జాతీయ సమావేశానికి ఆహ్వానం అందింది. గుంటూరు జిల్లా పెదనందిపాడు ఎంపీడీవో జీ లక్ష్మీదేవి, గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామ సర్పంచ్ ఎం.లలితకుమారి, వెంగళాయపాలెం గ్రామ కార్యదర్శి వి.రవి, కొల్లిపర మండలం వల్లభాపురం సర్పంచ్ బి.భ్రమరాంబ, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామ సర్పంచ్ షేక్ గొసియా బేగం స్నేహపూర్వక పంచాయతీల (ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ) పేరుతో ప్రత్యేక కార్యక్రమాలను పంచాయతీలో అమలు చేస్తున్నారు. ఇందుకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి సమావేశాలకు వీరికి ఆహ్వానం అందడంతో సోమవారం పయనమై వెళ్లారు.

హాల్‌టికెట్ల కలర్ ప్రింటవుట్‌ను అనుమతించం

డీఐఈఓ. నీలావతిదేవి

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్‌టికెట్లను వైట్ పేపర్‌పై ప్రింటవుట్ తీసుకొని పరీక్ష కేంద్రాలకు రావాలని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి సోమవారం తెలిపారు. కొందరు విద్యార్థులు హాల్‌టికెట్లను కలర్ ప్రింట్‌లో తీసుకువస్తున్నారని, వాటిని అనుమతించటం లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఇంటర్మీడియెట్ విద్యామండలి నుంచి ప్రత్యేక ఉత్తర్వులు అందినట్టు వివరించారు. విద్యార్థులు గమనించి తమ వెంట తెల్లకాగితంపై ప్రింట్ చేసిన హాల్‌టికెట్లతో హాజరు కావాలని సూచించారు.

జలపాలేశ్వరుడిపై సూర్యకిరణాలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని జలపాలేశ్వర ఆలయంలో స్వామిపై మంగళవారం సూర్యకిరణాలు ప్రసరించాయి. ఈ సమయంలో అనేకమంది భక్తులు ఆలయానికి వచ్చి స్వామికి అభిషేకాలు చేయించుకున్నారు. గ్రామంలో చోళుల కాలంనాటి జలపాలేశ్వర ఆలయం ఉంది. 16వ శతాబ్దంలో నిర్మించిన ఈ ఆలయంలోని జలపాలేశ్వరుడిపై ఏటా పాల్గుణ మాసంలో కొద్దిరోజులపాటు సూర్యోదయ కాలంలో సరాసరి స్వామివారి లింగాకృతి కింది భాగం నుంచి పూర్తిగా స్వామి పైవరకు సూర్యకిరణాలు ప్రసరిస్తాయని ఆలయ అర్చకులు ఉమాపతి శాస్త్రి తెలిపారు. మళ్లీ అవి తగ్గుముఖం పట్టి పూర్తిగా సూర్యకిరణాలు ప్రసరించడం ఆగుతుందని తెలిపారు.

దేవాంతకులు..!

- త్రికోటేశ్వరుని భూమినీ వదలని అక్రమార్కులు
- కోటప్పకొండలో యథేచ్ఛగా మైనింగ్
- ఎమ్మెల్యే ఆధ్వర్యంలోనే తవ్వకాలు
- ఆయన బంధువే సూత్రధారి
- అడ్డుకుంటే బెదిరింపుల పర్వం



మైనింగ్ పేరిట తవ్వేసిన కోటప్పకొండ ఆలయ భూమి

సాక్షి నరసరావుపేట: కోటప్పకొండలో అక్రమ మైనింగ్‌కు అలవాటుపడిన టీడీపీ నేతలు దేవాలయ భూములనూ వదలడం లేదు. త్రికోటేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు జరుపుతున్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలోనే దేవుడి భూముల్లో మైనింగ్ దందా సాగుతోంది. త్రికోటేశ్వరుని ఆలయ భూముల్లో అక్రమ మైనింగ్ జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత కోటప్పకొండ కేంద్రంగా అక్రమ మైనింగ్‌కు తెర తీశారు. కోటప్పకొండ సమీపంలోని పంట పొలాలు, కొండల్లో ఈ మైనింగ్ దందాను నడిపిస్తున్నారు. ఇప్పుడు మైనింగ్ అక్రమార్కుల కన్ను కోటప్పకొండ ఆలయ భూములపైనా పడింది. కొండకావూరు పంచాయతీ పరిధిలో ఆలయానికి 20 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఇది కాకుండా ఆలయానికి సేవలు అందించిన నాయీబ్రాహ్మణులకు గతంలో ఆరున్నర ఎకరాల భూమిని ఇక్కడ కేటాయించారు. ఈ భూమిని సాగు చేసుకొని ఫలసాయాన్ని పొందే హక్కు మాత్రమే దేవదాయ చట్టం ప్రకారం వీరికి ఉంటుంది. అయితే ఈ భూములకు సంతమాగులూరు మండలం చౌటుపాలెం టీడీపీ నాయకుడు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించాడు. ఇతని వద్ద నుంచి తక్కువ ధరకు భూమిని కొన్న అక్రమార్కులు తవ్వకాలను పెద్ద ఎత్తున చేపట్టారు. ఆరు ఎకరాల్లో రెండు ఎకరాలకుపైగా ఇప్పటికే తవ్వకాలు జరిపారు. అలాగే ఆలయానికి చెందిన భూముల్లోనూ తవ్వకాలు ప్రారంభించారు.

పోలీసులకు ఫిర్యాదు చేశాం

ఆలయ భూముల్లో తవ్వకాలు జరిపినట్టు సమాచారం రాగానే పోలీసులకు ఫిర్యాదు చేశాం. శివరాత్రి పనుల్లో బిజీగా ఉన్న సమయంలో రాత్రి వేళల్లో ఈ తవ్వకాలు జరిగాయి. నాయీబ్రాహ్మణులకు కేటాయించిన భూముల్లో జరిగిన తవ్వకాలు మా దృష్టికి రాలేదు. భూములను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– డి.చంద్రశేఖరరావు, ఈవో, కోటప్పకొండ

టిప్పర్‌కు రూ.వెయ్యి వసూలు

ఎమ్మెల్యే సమీప బంధువు మైనింగ్ కార్యకలాపాలు చూస్తున్నాడు. తవ్వకందారుల నుంచి ఇతనే ఎమ్మెల్యే పేరుతో కప్పం వసూలు చేస్తున్నాడు. ఒక్కో టిప్పరుకు రూ.1,000 చొప్పున ముక్కుపిండీ మరీ తీసుకుంటున్నాడు. దీంతోపాటు అతనూ తవ్వకాలు జరిపి మట్టిని అమ్ముకుంటున్నాడు. ఇతని ఆధ్వర్యంలోనే కోటప్పకొండ ఆలయ భూముల్లో అక్రమ మైనింగ్ సాగినట్టు సమాచారం. ఆలయ భూముల్లో తవ్వకాల వ్యవహారం తెలిసిన అధికారులు అడ్డుకునేందుకు యత్నించగా ఎమ్మెల్యే బంధువు వారిపై బెదిరింపులకు దిగినట్టు తెలిసింది.

ఎమ్మెల్యేదే ముఖ్యపాత్ర!



నాయీబ్రహ్మణులకు కేటాయించిన భూమిలో తవ్వకాలు జరిపిన దృశ్యం

గత ఎనిమిది నెలలుగా కోటప్పకొండ వద్ద జరుగుతున్న అక్రమ మైనింగ్‌లో ఎమ్మెల్యే ముఖ్యపాత్ర పోషిస్తున్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తవ్వకాలు సాగుతున్నట్టు చర్చ నడుస్తోంది. ఎన్నో ఏళ్లుగా కోటప్పకొండలో మైనింగ్ నిర్వహిస్తున్నారు. దేవాలయ భూముల జోలికి ఇప్పటివరకు ఎవరూ పోలేదు. ప్రభుత్వం తమదే అన్న ధైర్యంతోనే ఆలయ భూముల్లోనూ ఇప్పుడు అక్రమ మైనింగ్‌ను ప్రారంభించినట్టు సమాచారం.

ఆలపాటి గెలుపు



ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు గెలుపు ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి నాగలక్ష్మి

- మొదటి ప్రాధాన్య ఓట్లతోనే మ్యాజిక్ ఫిగర్
- 82,320 ఓట్ల మెజారిటీ
- అనైతికంగా గెలిచారంటున్న పీడీఎఫ్
- ప్రజలు కూటమికే పట్టం కట్టారన్న ఆలపాటి

సాక్షి ప్రతినిధి, గుంటూరు : కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికయ్యారు. మొత్తం తొమ్మిది రౌండ్ల కౌంటింగ్ జరగగా మొత్తం పోలైన ఓట్లు 2,41,774కి గాను 2,14,865 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 26,909 ఓట్లు చెల్లలేదు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 1,45,057 ఓట్లు సాధించారు. తన సమీప ప్రత్యర్థి పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు 62,737 ఓట్లు వచ్చాయి. దీంతో ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ 82,320 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. మొదటి ప్రాధాన్య ఓట్లతోనే ఈ విజయం దక్కించుకున్నారు. మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో ఉండగా మిగిలిన వారెవరూ కనీస పోటీ ఇవ్వలేదు. మూడోస్థానంలో ఉన్న అన్నవరపు ఆనందకిషోర్‌కు 860 ఓట్లు దక్కగా గౌతుకట్ల అంకమ్మరావుకు అత్యల్పంగా 26 ఓట్లు దక్కాయి. మంగళవారం గుంటూరు కలెక్టర్ చాంబర్‌లో కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల రిటర్నింగ్ అధికారి, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ధ్రువీకరణ పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

దొంగ ఓట్లు, రిగ్గింగ్‌తో గెలిచారు

ఈ ఎన్నికల్లో దొంగ ఓట్లు, బూత్ క్యాప్చరింగ్, రిగ్గింగ్‌లతో అధికార పార్టీ గెలిచిందని పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు ఆరోపించారు. ఫలితాల వెల్లడి అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలను రాజకీయం చేసిందని, తనపై ప్రత్యర్థులు దుష్ప్రచారం చేశారని, ఉద్యోగులు, ఉపాధ్యాయ వర్గాల మధ్య చీలిక తెచ్చారని, రూ.కోట్లు ఖర్చు చేశారని విమర్శించారు. అనేక చోట్ల ఎన్నికల రోజు, దొంగ ఓట్లు, అక్రమాలు చోటుచేసుకున్నాయని, దీనికి అధికార యంత్రాంగం కూడా సహకరించిందని ధ్వజమెత్తారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు అనేక సమస్యలు ఉన్నాయి. నిరుద్యోగ యువత, రైతులు పలు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్ట్, అవుట్ - సోర్సింగ్, అనేక రంగాల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ అంశాలపై పోరాటాలను కొనసాగిస్తానని కేఎస్ లక్ష్మణరావు ప్రకటించారు.

40 శాతం మంది తొలిసారి ఓటర్లు

ఎన్నికల్లో గెలుపొందిన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో 40 శాతం మంది తొలిసారి ఓటు హక్కును ఉపయోగించుకున్నారని చెప్పారు. తనపై అసత్య ప్రచారం చేసినా ఓటర్లు కూటమిని గెలిపించారని పేర్కొన్నారు. సమస్యలపై శాసన మండలిలో గళం విప్పుతానని వివరించారు.

తప్పు చేశా.. క్షమించండి

- ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌లు పెట్టి మోసపోయా
- నెల రోజుల్లో పింఛన్ డబ్బులు చెల్లిస్తా
- పరారైన సచివాలయ వెల్ఫేర్ కార్యదర్శి లక్ష్మీప్రసాద్.



భార్య, పిల్లలతో వెల్ఫేర్ కార్యదర్శి లక్ష్మీప్రసాద్

దాచేపల్లి : పింఛన్‌దారుల డబ్బులు తీసుకుని పరారీలో ఉన్న దాచేపల్లి నగర పంచాయతీలోని వార్డు సచివాలయం-3 వెల్ఫేర్ కార్యదర్శి సంపతి లక్ష్మీప్రసాద్ సామాజిక మాధ్యమాల్లో మంగళవారం పోస్ట్ చేసిన వీడియో వైరల్‌గా మారింది. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో డబ్బులు పెట్టి మోసపోయాను. నెలరోజులు గడువు ఇస్తే డబ్బులు చెల్లిస్తా.. అంటూ ఆ వీడియోలో చెప్పాడు. ఇంకా ఆ వీడియోలో ఏమి చెప్పడంటే.. ''సార్.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లు పెట్టి ఎన్నో డబ్బులు పోగొట్టుకున్నా. గవర్నమెంట్ డబ్బులు కూడా ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పెట్టి మోసపోయా. నేను తప్పు చేశానని ఈ రోజు అర్థమైంది. కలెక్టర్ గారు, కమిషనర్ గారు నేను తప్పు చేశా. నన్ను క్షమించండి. ఒక నెల నాకు అవకాశం ఇస్తే తల్లిదండ్రులను బతిమాలుకుని నేను తీసుకున్న డబ్బులను చెల్లిస్తా. నేను చేసిన తప్పు వల్ల నా భార్య పిల్లలతో రోడ్డుపై పడ్డా. పిల్లలు రెండు రోజుల నుంచి ఏమీ తినలేదు. ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. నా తప్పు తెలుసుకున్నా. ఒక్క అవకాశం ఇప్పించండి. ఇంకోసారి ఇటువంటి తప్పు చేయను. నా భార్య పిల్లలతో కలిసి సూసైడ్ చేసుకోవాలని డిసైడ్ అయ్యాం. సార్ మమ్మల్ని క్షమించండి'' అంటూ ఆ వీడియోలో లక్ష్మీప్రసాద్ చెప్పాడు. ఫిబ్రవరి 28న బ్యాంక్ నుంచి డ్రా చేసిన రూ.8.23 లక్షల పింఛన్ డబ్బులతో లక్ష్మీప్రసాద్ పారిపోయిన విషయం తెలిసిందే. ఇతనిపై కమిషనర్ ఎంవీ అప్పారావు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో దర్యాప్తు చేపట్టారు. తాజాగా లక్ష్మీప్రసాద్ తాను మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయటంతో అతని ఆచూకీ కనుగొనేందుకు నగర పంచాయతీ అధికారులు, పోలీసులు యత్నిస్తున్నారు.

మానవతా నాడి పట్టాలి

- రోగులపై దయ చూపాలి
- డీఎంఈ డాక్టర్ నరసింహం
- ఉత్సాహంగా వైద్య కళాశాల 74వ గ్రాడ్యుయేషన్ డే

స్టెతస్కోప్ చెవిన పెట్టకుండానే లబ్‌డబ్ సవ్వడి వీనులను తాకిందా.. మది నిండా ఉప్పొంగిన భావోద్వేగం ఆనందబాష్పమై కురిసిందా.. ఆరేళ్ల శ్రమ కనుల వేడుకై మెరిసిందా.. ఎన్నాళ్లో వేచిన హృదయం 'పట్టా'భిషిక్తమై మురిసిందా.. అన్నట్టు గుంటూరు వైద్యకళాశాల సంతోషాల వేదికైంది. గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహంతో ఉప్పొంగింది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఆత్మీయ ఆలింగనాలతో నవ్వులు చిలికింది. ఈ సంబరమంతా తళుకులీని కెమెరాల్లో అందంగా బంధీయైంది.



వైద్య విద్య పట్టాలతో నవ్వులు చిందిస్తున్న విద్యార్థులు

గుంటూరు మెడికల్: వైద్యులు రోగుల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నరసింహం అన్నారు. మంగళవారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో 74వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు జరిగాయి. వైద్య కళాశాల 2019 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులకు డీఎంఈ డాక్టర్ నరసింహం డిగ్రీ పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహం మాట్లాడుతూ వైద్య రంగంలో మానవతా విలువలకు పెద్ద పీట వేయాలని చెప్పారు. వైద్య రంగంలో రోబోటిక్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ వచ్చినా హ్యూమన్ టచ్ ఇవ్వలేవని, వైద్యుడికే అది సాధ్యమని పేర్కొన్నారు. రోగిపై సానుభూతి, మానవతా దృక్పథం కలిగి ఉండాలన్నారు. వైద్యులు డబ్బుల కోసం ఆరాటపడకూడదని సూచించారు. అనంతరం నరసింహంను వైద్యశాల నిర్వాహకులు సత్కరించారు.

మాతృసంస్థ అభివృద్ధికి తోడ్పడండి

గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో రూ.100 కోట్లతో ఎంసీహెచ్ నిర్మాణం జీజీహెచ్‌లో జరుగుతుందని చెప్పారు. 2026 జనవరి నాటికి భవనం అందుబాటులోకి వస్తుందని, ప్రభుత్వం రూ.40 కోట్ల విలువ గల వైద్య పరికరాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. వైద్య కళాశాలలో చదువుకున్నవారంతా వైద్య వృత్తిలో బాగా స్థిరపడిన తరువాత మాతృ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు.

యాంత్రిక వైద్యం వలదు

గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి మాట్లాడుతూ రోగుల పట్ల జాలి, దయ కలిగి ఉండాలని, నేడు చాలా మంది వైద్యులు కఠినంగా మారిపోయారని పేర్కొన్నారు. రోబో మాదిరిగా యాంత్రికంగా వైద్యులు మారిపోయారని, వైద్య వృత్తి వ్యాపారంగా మారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా వైద్య వృత్తిలోకి వస్తున్నవారు మానత్వం కలిగిన వైద్యులుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, జింఖానా కో-ఆర్డినేటర్ పి.వి.హనుమంతరావు పాల్గొన్నారు.

కిక్కిరిసిన ఆడిటోరియం

వైద్య విద్యార్థులకు పట్టా ప్రదానం వేడుకను కనులారా వీక్షించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఫలితంగా వైద్య కళాశాల ఆవరణం, కళాశాల ఆడిటోరియం కిక్కిరిసిపోయాయి. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా కళాశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఎక్కువగా రైతు కుటుంబాలకు చెందిన పిల్లలు వైద్యులుగా పట్టాలు తీసుకుంటున్న నేపథ్యంలో ఈ కమనీయ దృశ్యాలను బంధించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేకంగా వీడియోగ్రాఫర్లు, ఫొటోగ్రాఫర్లను పెట్టుకుని హాజరవడం అందరినీ ఆకట్టుకుంది. విద్యార్థులు పట్టాలు చేతపట్టుకుని కుటుంబ సభ్యులు, స్నేహితులతో కళాశాల ప్రాంగణంలోనే ఫొటోలు దిగి మురిసిపోయారు.



డీఎంఈ నరసింహంను సత్కరిస్తున్న దృశ్యం

మహిళా వారోత్సవాలు నిర్వహించండి

కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు



కలెక్టర్ కార్యాలయంలో సమీక్షిస్తున్న కలెక్టర్, ఎస్పీ

నరసరావుపేట: ఈనెల ఎనిమిదిన మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో వారోత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వారోత్సవాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వారోత్సవాల నిర్వహణ నోడల్ అధికారిగా ఐసీడీఎస్ పీడీ ఉమాదేవిని నియమించారు. ఆరో తేదీన జిల్లాలోని మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగినులను తగిన రీతిలో గౌరవిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో ఎ.మురళి, డీఎఫ్ఓ కృష్ణప్రియ, ఆర్డీవో కె.మధులత పాల్గొన్నారు.

రేపటి నుంచి గుడారాల పండగ



వివరాలు వెల్లడిస్తున్న అబ్రహం

అమరావతి: ఏటా నిర్వహించే గుడారాల పండగను ఈ ఏడాది గుంటూరు శివారులోని గోరంట్లలో కాకుండా మండల పరిధిలోని లేమల్లె గ్రామంలో నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లనూ పూర్తిచేశామని హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం చెప్పారు. మంగళవారం లేమల్లెలోని హోసన్నా దయాక్షేత్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హోసన్నా మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు ఏసన్నా తొలుత లేమల్లె గ్రామంలో హోసన్నా మందిరం నిర్మాణం చేసిన ప్రదేశంలో సుమారు 25 ఏళ్ల తర్వాత 48వ గుడారాల పండగ నిర్వహిస్తున్నట్టు వివరించారు. ఈనెల 6,7,8,9 తేదీలలో జరిగే ఈ పండగకు విశ్వాసులు తరలిరావాలని కోరారు. ఆర్టీసీ గుంటూరు నుంచి ప్రత్యేకంగా బస్సులు నడుపుతున్నట్టు వెల్లడించారు. ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. పోలీసు శాఖ బందోబస్తును పర్యవేక్షిస్తుందని వెల్లడించారు. రాయలసీమ, భీమవరం, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి గుంటూరుకు వచ్చే రైళ్లలో 15 ప్రత్యేక కోచ్‌లను గుడారాల పండగ కోసం ఏర్పాటు చేయడం విశేషమని పేర్కొన్నారు. ఐదో తేదీ బుధవారం సాయంత్రం హోసన్నా దయాక్షేత్రంలో కొత్తగా నిర్మించిన చర్చి ప్రారంభోత్సవం జరగనుందని వెల్లడించారు.

ఎస్‌ఐ వేధింపులు తాళలేక..

- వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- టీడీపీ నాయకుల ప్రోద్బలంతో ఖాకీల అరాచకం



బాధితుడు ఎస్‌కే రఫీ

సాక్షి, నరసరావుపేట : పోలీసుల వేధింపులు తాళలేక వినుకొండ రూరల్ మండలం ఉమ్మడివరం గ్రామానికి చెందిన ఎస్‌కే రఫీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. రఫీ వైఎస్సార్ సీపీ కార్యకర్త. గతంలో రఫీ తమను బూతులు తిట్టాడంటూ ఇటీవల గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు పోలీసుల ద్వారా వినుకొండ స్టేషన్‌కి అతడిని పిలిపించారు. వారం రోజుల నుంచి ఎలాంటి కేసు నమోదు చేయకుండా రోజూ ఉదయాన్నే రఫీని పోలీస్ స్టేషన్‌కు పిలిపిస్తున్నారు, సాయంత్రం వరకు ఉంచుతున్నారు. దారుణంగా కొడుతున్నారు. మంగళవారం కూడా పోలీస్‌స్టేషన్‌కు రావాలని ఎస్ఐ సత్యనారాయణ ఫోన్ చేశాడు. టీడీపీ నాయకుల కాళ్లు పట్టుకుని క్షమాపణ అడగాలని, వాళ్లు క్షమించారని తనకు చెబితేనే వదిలిపెడతామని ఎస్ఐ రఫీని భయపెట్టారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన రఫీ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానిక ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న భార్య ఫాతిమా, తల్లి శిలార్‌బీలతో పాటు పలువురు గ్రామస్తులు ఆస్పత్రి వద్దకు చేరుకొని ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయం చేయాల్సిన పోలీసులే ఈ విధంగా ప్రవర్తించడాన్ని తప్పుబట్టారు. ఉన్నతాధికారులు స్పందించి ఈ ఘటనపై పూర్తి విచారణ చేయించి బాధితులకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

7 నుంచి కృత్రిమ అవయవాలు పంపిణీ

అచ్చంపేట: దివ్యాంగులకు ద చేంజ్ మేకర్స్ సంస్థ, ఆర్కే ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 7, 8, 9వ తేదీలలో విజయవాడలోని సి.వి.రెడ్డి హాల్‌లో కృత్రిమ అవయవాలు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు కమల్‌సైదా మంగళవారం అచ్చంపేటలో విలేకరులకు తెలిపారు. అవసరమైన వారు వివరాలను 70138 31026, 95505 45539, 83676 75615 ఫోను నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

కాపుసారా విక్రయిస్తే కఠిన చర్యలు


తండా వాసులతో రవికుమార్ రెడ్డి

అచ్చంపేట: గ్రామాలలో కాపుసారా విక్రయించినా, కాచి అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎన్ఫోర్స్‌మెంట్ రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని కంచుబోడు, జడపల్లి, సంద్ర తండాలలో ఆయన పర్యటించారు. అన్ని ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన తండా వాసులతో మాట్లాడారు. కాపుసారా తాగడం వల్ల అనారోగ్యం పాలవుతారని, కుటుంబాలకు దూరం అవుతారని చెప్పారు. కుటుంబంతో చక్కగా జీవించాలని, సన్మార్గంలో నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సూర్యనారాయణ, క్రోసూరు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తులసి, ఎస్‌ఐలు శ్రీనివాస్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి శిక్షణకు నందిగామ సర్పంచ్


బలిజేపల్లి రమాదేవి


చిలువూరి కృష్ణప్రసాద్

సత్తెనపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలోని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో ఈ నెల 5, 6వ తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, పంచాయతీ రాజ్ శిక్షణ సంస్థ 'ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీలు' అంశంపై రెండు రోజుల రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించనుంది. పల్నాడు జిల్లా నుంచి సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, పంచాయతీ కార్యదర్శి చిలువూరి కృష్ణప్రసాద్ దీనికి ఎంపిక అయినట్లు సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తెలిపారు. ఒక్కో జిల్లా నుంచి ఎంపిక అయిన 26 మోడల్ ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటారన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు


జెండా ఊపి క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఘంటసాల శ్రీనివాసరావు

గుంటూరు మెడికల్: ఉద్యోగులు ఒత్తిడితో నిత్యం సతమతమవుతున్న మహిళలకు క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం లభిస్తోందని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోంలో మహిళ ఉద్యోగులకు క్రీడాపోటీలు ప్రారంభించారు. క్రీడా పోటీలను ఘంటసాల శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మహిళలు ఒక పక్క ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ మరోపక్క కుటుంబ బాధ్యతలతో బాగా బిజీగా ఉంటారన్నారు. అలాంటివారికి ఆటవిడుపుగా క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. 200 మంది మహిళ ఉద్యోగులు పోటీల్లో పాల్గొన్నట్లు ఏపీ ఎన్జీఓ మహిళ విభాగం జిల్లా చైర్మన్ రాధారాణి అన్నారు. క్రీడల్లో పాల్గొన్న మహిళ ఉద్యోగులకు రెండు రోజులపాటు కలెక్టర్ సెలవు ప్రకటించారని బుధవారం కూడా క్రీడా పోటీలు జరుగుతాయని జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్యామ్‌సుందర శ్రీనివాస్, రాజశేఖర్, వెంకటరెడ్డి, సుకుమార్, శ్రీధర్‌రెడ్డి, సయ్యద్‌జానీబాషా, సూరి, కళ్యాణ్‌కుమార్, నాగేశ్వరరావు, మరీలు, కన్వీనర్ లక్ష్మీరమ్య, జాయింట్‌సెక్రటరీ శివజ్యోతి పాల్గొన్నారు.

జోసిల్‌లో ఘనంగా జాతీయ భద్రత వారోత్సవాలు

మేడికొండూరు: మండల పరిధిలోని డోకిపర్రులోని జోసిల్ కర్మాగారంలో జాతీయ భద్రత వారోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆ సంస్థ సెక్రటరీ, డీజీఎం కోటా రఘురాం మాట్లాడుతూ మంగళవారం నుంచి పదో తేదీ వరకు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ భద్రతా ప్రమాణాలను పాటించాలని కోరారు. ఈ సందర్భంగా కార్మికులకు, ఉద్యోగులకు పలు రకాల పోటీలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు భద్రతపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ అడ్వైజర్లు రామినేని బెనర్జీ బాబు, యడ్లపాటి భాను ప్రసాద్ పాల్గొన్నారు.

మిర్చి యార్డులో 1,27,375 బస్తాల విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి మార్కెట్ యార్డుకు మంగళవారం 1,25,574 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,27,375 బస్తాలు అమ్మకాలు జరిగాయి. ఈ సీజన్‌లో ఈ స్థాయిలో మిర్చి బస్తాలు రావడం ఇదే ప్రథమం. శని, ఆదివారాలు యార్డుకు సెలవు కావడంతో ఆదివారం రాత్రి నుంచే వాహనాల్లో మిర్చి బస్తాలను తీసుకురాగా యార్డు నిండిపోయింది. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. ఇంకా 70,117 బస్తాలు నిల్వ ఉన్నాయి.

ముగిసిన బాల్ బాడ్మింటన్ పోటీలు


బహుమతి అందుకుంటున్న జేఎంజే మహిళా కళాశాల జట్టు

నరసరావుపేట రూరల్: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బాల్ బాడ్మింటన్ పోటీలు మంగళవారం ముగిశాయి. రెండు రోజులపాటు కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతగా జేఎంజే మహిళా కళాశాల (తెనాలి) ప్రథమ, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వ్యాయామ కళాశాల ద్వితీయ, ఎంఏఎం ఫార్మసీ కళాశాల (కేసానుపల్లి) తృతీయ బహుమతులు సాధించాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా చిలకలూరిపేట శ్రీ నిఖిల టెక్నో స్కూల్ డైరెక్టర్ వాలేటి శిరీష, వర్సిటీ యోగా సెంటర్ కో ఆర్డినేటర్ డి.సూర్యనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఆటలో గెలుపు, ఓటములు సహజమని తెలిపారు. కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు మాట్లాడుతూ క్రీడలతో పోరాట స్ఫూర్తి అలవడుతుందని తెలిపారు. విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు అందజేశారు. కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ఫిజికల్ డైరెక్టర్ జె.శంకర్, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ సీహెచ్ వెంకట్రావు, జె.ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల సామూహిక నివారణకు చర్యలు


ఎర తయారీ విధానాన్ని వివరిస్తున్న ఐ.మురళి

నకరికల్లు: ఎలుకల సామూహిక నివారణ చేపడితే వరి పంటను కాపాడుకోవడంలో ఆశించిన ఫలితాలు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి సూచించారు. మండలంలోని దేచవరం గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎలుకల సామూహిక నివారణ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో తొలిసారిగా దేచవరంలో ప్రారంభించారు. బ్రోమోడయోలిన్ మందును విషపు ఎరగా తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించి, ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని 28 వేల హెక్టార్ల విస్తీర్ణంలో వరి పంటలో ఈ నివారణ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. వరి పంట పిలక దశ నుంచి చిరుపొట్ట దశలో వరకు పంటను ఎలుకలు అధికంగా నాశనం చేస్తాయని అన్నారు. ఎలుకల దాడితో ఎకరాకు 10 నుంచి 30 శాతం పంట నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. పల్నాడు జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి మాట్లాడుతూ.. ఒక కేజీ విషపు ఎర తయారీకి నూకలు 96 శాతం, నూనె 2 శాతం, రసాయనిక మందు 2 శాతం కలిపి వాడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎం.నగేష్, పిడుగురాళ్ల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బి.శ్రీకృష్ణదేవరాయలు, మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, ఎంపీఈఓలు కె.రవిబాబు, కె.హనుమంతరావు, వీఏఏ షేక్.సుభాని, ఏఈఓ కె.దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

నమ్మకంగా తీసుకెళ్లి చంపేశారు..!

- మద్యంలో పురుగు మందు కలిపి తాగించిన వైనం
- కార్ల ఫైనాన్స్ వ్యాపారి మృత్యువాత


అంజిబాబు (ఫైల్)

పిడుగురాళ్ల: తెలిసిన వ్యక్తులు నమ్మకంగా తీసుకెళ్లి ఒకరిని హత్య చేశారు. ఈ సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు కథనం మేరకు... సత్తెనపల్లికి చెందిన మందడపు అంజిబాబు అనే వ్యక్తికి పిడుగురాళ్ల పట్టణంలోని రైల్వే స్టేషన్ మాస్టర్ రామారావు పరిచయం అయ్యాడు. నాలుగు రోజుల నుంచి పిడుగురాళ్ల రైల్వే క్వార్టర్స్‌లోనే ఉంటున్నాడు. అంజిబాబుకు తెలిసిన కొందరు వ్యక్తులు సత్తెనపల్లి నుంచి పిడుగురాళ్లకు సోమవారం ఉదయం 11 గంటల సమయంలో వచ్చారు. పిడుగురాళ్ల రైల్వే క్వార్టర్స్‌లో ఉన్న అంజిబాబును కలిసి కొంత సమయం మాట్లాడారు. తర్వాత అందరూ మాచవరం మండలంలోని నాగేశ్వరపురం తండా సమీపంలో, పిడుగురాళ్ల మండలానికి బోర్డర్‌లో మద్యం తాగేందుకు వెళ్లారు. మద్యంలో పురుగు మందు కలిపి అంజిబాబుకు తాపించటంతో అతడి పరిస్థితి విషమంగా మారింది. ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించే సమయంలో పెట్రోలింగ్ పోలీసులు ఆపారు. మద్యం తాగాడని, ఆరోగ్యం బాగాలేదని చెప్పటంతో పోలీసులు వారిని హాస్పిటల్‌కు వెళ్లాలని పేర్కొన్నారు. పట్టణంలో ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అంజిబాబు(40) మృతి చెందాడు. సత్తెనపల్లి మండలంలోని పాకాలపాడు గ్రామానికి చెందిన అంజిబాబు కార్లకు ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండేవాడు. వృత్తి రీత్యా సత్తెనపల్లి పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. ఆర్థిక లావాదేవీలు ఈ గొడవకు కారణమై ఉండవచ్చునని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పిడుగురాళ్ల పట్టణంలో సుమారు ఐదారుగురు వ్యక్తులు అతడిని తీసుకొని వెళ్లినట్లు ఆధారాలు ఉన్నాయి. నిందితుల్లో సుప్రీం, రైల్వే గేటు వద్ద నివాసం ఉంటున్న అమ్మయ్య, సత్తెనపల్లి పట్టణానికి చెందిన నాని, బాజీ, మరికొంత మంది ఉన్నట్లు సమాచారం. సత్తెనపల్లి డీఎస్పీ ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

యూత్ పార్లమెంట్ పోటీలకు ఆహ్వానం


యూత్ పార్లమెంట్ పోటీ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: యూత్ పార్లమెంట్ పోటీలను సద్వినియోగం చేసుకోవాలని నెహ్రూ యువ కేంద్ర జిల్లా యూత్ అధికారి కిరణ్మయి దేవిరెడ్డి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో మంగళవారం యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల నుంచి 18 ఏళ్ల నుంచి 25 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారు యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని సూచించారు. తొలుత ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఒక్క నిమిషం నిడివి కలిగిన 'వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ అనే అంశం పైన వీడియో చేసి ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి 11–59లోగా మై భారత్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ఈ విధంగా నమోదు చేసుకున్న వారిని స్క్రీనింగ్ చేసి జిల్లా స్థాయిలో ఎంపిక చేస్తారని వివరించారు. ఆయా జిల్లాల నుంచి ఎంపికైన వారికి జిల్లా స్థాయిలో టీజేపీఎస్ కళాశాలలో 150 మంది విద్యార్థులకు పోటీ ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో 'వన్ నేషన్, వన్ ఎలక్షన్ :పేవింగ్ ది వే ఫర్ వికసిత్ భారత్ అనే అంశంపై 3 నిముషాలు మాట్లాడాలని తెలిపారు. వర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, ఆయా జిల్లాల ఎన్ఎస్ఎస్ అధికారులు, యూత్ నాయకులు, నెహ్రూ యువ కేంద్ర అధికారులు, ఇతర అధ్యాపకులు, సామాజిక కార్యకర్తలు పోటీల గురించి యువతకు అవగాహన కల్పించి, ఎక్కువ సంఖ్యలో పాల్గొనేలా చూడాలని చెప్పారు. వివరాలకు డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ (9849854221), కిరణ్మయి దేవిరెడ్డి (9177753393)ని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి డాక్టర్ బీవీహెచ్ కామేశ్వర శాస్త్రి, సీహెచ్ రాంబాబు, ఆర్.జయశైలజ పాల్గొన్నారు.

బైకుల చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు

నరసరావుపేట టౌన్: మూడు చోట్ల బైకుల చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి ఆర్.ఆశీర్వాదం పాల్ మంగళవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గత ఏడాది నవంబర్ 19న నరసరావుపేట జీబీఆర్ వైద్యశాల వద్ద బైకు చోరీ కావడంతో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అదే రోజు రామిరెడ్డిపేటకు చెందిన షేక్ మహబూబ్ సుభాని ఇంటివద్ద, గీతామందిర్ వద్ద కంభంపాటి వెంకట చలమయ్యకు చెందిన బైకు చోరీ అయ్యాయి. పోలీసులు దర్యాప్తు అనంతరం నిందితుడు నాదెండ్ల మండలం కనపర్తి గ్రామానికి చెందిన బాల యేసుగా గుర్తించారు. వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. దీంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువరించింది. ఏక కాలంలో మూడు కేసుల్లో ఏడాది శిక్ష అనుభవించేలా తీర్పులో పేర్కొన్నారు.

కబడ్డీ జట్ల ఎంపిక


ఎంపికైన ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ జట్టు

బాపట్ల: బాపట్ల మున్సిపల్ హైస్కూలులో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా కబడ్డీ సబ్ జూనియర్ బాలబాలికల జట్ల ఎంపిక నిర్వహించారు. ఎంపికైన జట్లు ఈనెల 14,15,16 తేదీలలో కడప జిల్లాలో జరిగే అంతర జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటాయని గుంటూరు జిల్లా (కబడ్డీ) సెక్రటరీ మంతెన సుబ్బరాజు తెలిపారు. బాలికల జట్టులో జె.ప్రవల్లిక, సారిక, కీర్తి, హాసిని, సలోమి, ఆసిఫా, అమూల్య, శ్రావ్య (నరసాయపాలెం), కీర్తన(పేరలి), అంజలి, భార్గవి (నిజాంపట్నం), మౌనిక, దుర్గ, యామిని (ఎంపీపాలెం), బాలుర జట్టు ఎస్.హేమంత్, జె.మహిమరాజు, ఎస్.కె జుబెల్, కె.మణికంఠరెడ్డి, శ్రీనివాసులు, ప్రభు, ప్రశాంత్ (మునిసిపల్ హైస్కూల్, బాపట్ల), సాయి హర్షవర్ధన్ రెడ్డి, నాగభూషణ్, తేజ, చిన్న అయ్యప్ప (కర్లపాలెం), సుబ్బారావు, పోల్‌రెడ్డి (పేరలి), ప్రేమ్‌చంద్, మణి (దాచేపల్లి)లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీడీలు కత్తి శ్రీనివాసరావు, ఎన్.కుటుంబరావు, పి. శైలజ, కోచ్ తిరుపతమ్మ (పి.ఈ.టి) ఎం.సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ పూలింగ్‌కు రైతులు డిమాండ్


సర్వే అధికారులను అడ్డుకున్న రైతులు

అమరావతి: మండల పరిధిలోని వైకుంఠపురం గ్రామంలో పెన్నాగోదావరి నదుల అనుసంధాన ప్రాజెక్టుకు అవసరమైన భూములు ల్యాండ్ పూలింగ్ కింద మాత్రమే ఇస్తామని రైతులు మంగళవారం సర్వే అధికారులను అడ్డుకున్నారు. మంగళవారం వైకుంఠపురం గ్రామ పరిధిలో పెన్నా గోదావరి నదుల అనుసంధాన ప్రాజెక్టులో పంప్‌హౌస్ నిర్మాణానికి భూసర్వే చేస్తున్న అధికారులను అడ్డుకున్నారు. తమ భూముల సంగతి తేల్చిన తర్వాతే సర్వే చేయాలని మండల సర్వేయర్, వీఆర్‌వో తదితర సిబ్బందిని వెనక్కి పంపిచేశారు. ఈ సందర్భంగా రైతు భోగినేని సుబ్బారావు మాట్లాడుతూ.. రాజధానికి దగ్గరగా ఉన్న వైకుంఠపురం గ్రామంలో 56.88 ఎకరాల భూమిని ఈ ప్రాజెక్టుకు సేకరించాలని నిర్ణయించారన్నారు. తాము భూసేకరణకు అంగీకరించబోమని చెప్పారు. కార్యక్రమంలో బాధిత రైతులు పాల్గొన్నారు.

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబుకు సత్కారం


అద్దంకి శ్రీధర్‌బాబును సత్కరిస్తున్న మిత్ర తదితరులు

కొరిటెపాడు(గుంటూరు): పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఏడున్నర సంవత్సరాల పాటు కేంద్ర ప్రభుత్వ సేవలు పూర్తి చేసుకుని ఉత్తరఖండ్ రాష్ట్రానికి వెళ్తున్న అద్దంకి శ్రీధర్‌బాబును పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ఎస్.మిత్ర మాట్లాడుతూ శ్రీధర్‌బాబు పొగాకు పరిశ్రమకు చేసిన సేవలు అసమానమైనవని, రైతులు, వ్యాపారులు, ఉద్యోగుల అభ్యున్నతికి చేసిన కృషి శ్లాఘనీయమని కొనియాడారు. పొగాకు పరిశ్రమ వ్యవస్థకే ఒక స్ఫూర్తిదాయక వ్యక్తి శ్రీధర్‌బాబు అని, కోవిడ్ సమయంలో ఆయన బోర్డు కార్యకలాపాలు సమర్థంగా నడిపిన తీరు అందరి ప్రశంసలు పొందారన్నారు. సత్కార గ్రహీత శ్రీధర్‌బాబు మాట్లాడుతూ పొగాకు బోర్డుకి సేవలు చేసే అవకాశం భగవంతుడు ఇచ్చిన అనుగ్రహం అని పేర్కొన్నారు. తన తల్లీదండ్రులు, గురువుల వద్ద నేర్చుకున్న సిద్ధాంతం 'అన్నదాత సుఖీభవ' అని రైతులు బాగుంటేనే దేశం బాగుంటుందని అదే నా విజయానికి కారణమని తెలిపారు.

గురుకుల ఉర్దూ కళాశాలలో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: పాత గుంటూరు నందివెలుగురోడ్డులోని ఏపీ రెసిడెన్షియల్ ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పి.సాంబశివరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోస్తాంధ్రలో ముస్లిం, మైనార్టీ బాలుర విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న కళాశాలలో జూనియర్ ఇంటర్లో ప్రవేశానికి ఏప్రిల్ 25న జరగనున్న ఏపీఆర్జేసీ సెట్‌కు ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 87126 25073, 96525 69140 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పొన్నూరు రోడ్డు సంగడిగుంటలోని ఏపీ రెసిడెన్షియల్ మైనార్టీ బాలికల పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు కల్పించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.బాలాశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ ఖాళీల భర్తీ కోసం కోసం ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 31లోగా ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా తరగతుల్లో ప్రవేశాలకు ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష జరుగుతుందని, వివరాలకు 87126 25039 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.